సాక్షి
చిత్తూరు
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025

నగరిలో కల్తీ మద్యంపై కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మాజీ మంత్రి ఆర్కే రోజా



కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ నేతలు పిడికిలి బిగించారు. జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు హోరెత్తించారు. 'కల్తీ మద్యం నిర్మూలించాలి.. నారావారి సురాపాలన నశించాలి..' 'కల్తీ లిక్కర్ స్కామ్‌ను సీబీఐకి అప్పగించాలి' అంటూ నినాదాలు మిన్నంటించారు. ఎక్సైజ్ కార్యాలయాల వద్ద బైఠాయించారు. కల్తీ మద్యం ముడుపులు కరకట్ట బంగ్లాకు చేరాయని ధ్వజమెత్తారు. కూటమి పార్టీ అనుచరులే నిందితులని తెలిసినా ప్రభుత్వ పెద్దలు కేసు నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యం పెద్దలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆపై అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

కల్తీ మద్యంతో..
కరకట్ట బంగ్లాకు కోట్లు!

- 'నారా'వారి సురాపానాన్ని అరికట్టండి
- జిల్లాలో కల్తీ మద్యంపై నిరసనల హోరు
- కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- కల్తీ మద్యం కేసును సీబీఐకి అప్పగించండి
- ఎక్సైజ్ కార్యాలయాల వద్ద మిన్నంటిన నినాదాలు

చిత్తూరు అర్బన్: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నాయకుల కనుసన్నల్లోనే నకిలీ మద్యం బాగోతం నడిచింది. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో బయటపడ్డ నకిలీ మద్యం తయారీ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ చేరింది. ఇందులో వచ్చిన లాభాలు కూటమి నేతలు పంచుకు తిన్నారు. అందులో పెద్ద మొత్తంలో కరకట్ట బంగ్లాలోని పెద్దలకు కమీషన్లు అందాయి. వెంటనే ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలి. దీనిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయించాలి' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నకిలీ మద్యం ఘటనపై సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు.

చిత్తూరులో..

చిత్తూరు నగరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ.విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కట్టమంచి చెరువు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి అర్బన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం అరికట్టాలని, బెల్టు దుకాణాలు తొలగించాలని ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, రాష్ట్ర మునిసిపల్ విభాగం ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ హయంలో నకిలీ మద్యం ఏరులై పారుతున్నా ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా పారదర్శకంగా అమ్మకాలు సాగిస్తే, తమ నాయకులను వేధించడానికి తప్పుడు కేసులు బనాయించారన్నారు.

పలమనేరులో..

నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో పలమనేరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసి, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పట్టణంలో నకిలీ మద్యంపై నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

పూతలపట్టులో..

పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తూరులోని అర్బన్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, ఇందులోని ప్రభుత్వ పెద్దల పాత్ర తేలాలంటే సీబీఐ విచారణ జరిపించాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ పోలీసులకు వినతిపత్రం అందచేశారు.

కుప్పంలో..

కుప్పం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

నారాసురపాలన నశించాలి

నగరిలో మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో కలిసి కల్తీ మద్యంపై నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. నకిలీ మద్యం స్కాంపై సిట్ విచారణ వద్దని, సీబీఐ విచారణ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. నారావారి సారా పాలన నశించాలని నినాదాలు చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందించారు.



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

గంగాధరనెల్లూరులో

జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి ఆధ్వర్యంలో కార్వేటినగరంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళలు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. కల్తీమద్యం అమ్మకాలు బెల్టు దుకాణాల్లోనే జరిగాయని, వీటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. నకిలీ మద్యం అమ్మకాలతో మహిళల తాళిబొట్లు తెగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు.



చిత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విజయానందరెడ్డి, పార్టీ నాయకులు



పూతలపట్టులో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

మద్యపాన ప్రియుల ప్రాణాలు తీస్తుంటే పవన్ ఏమయ్యారో?

ఎన్నికల ముందు మద్యపాన ప్రియుల పొట్ట కొడతారా అంటూ పవన్‌కళ్యాణ్ ఊగిపోయారు. మరి నేడు మద్యం ప్రియుల ప్రాణాలు తీస్తున్నారు. వారికోసం ఎందుకు ఆవేశంతో ఊగడం లేదు. ఈ ప్రభుత్వంలో కల్తీ మద్యం స్కామ్ జరిగి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడితే ఇది వైఎస్సార్‌సీపీ కుట్ర అనేవారికి ఇంగిత జ్ఞానం ఉందా? వైఎస్‌ఆర్సీపీ కోవర్టులు చేస్తున్నారని చెప్పే చంద్రబాబు తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ టికెట్ శంకర్‌యాదవ్‌కు ఇవ్వకుండా జయచంద్రారెడ్డి ఎందుకు ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన 16 నెలల వరకు జయచంద్రారెడ్డి ఎవరి మనిషి అనేది మీకు తెలియదా? దొరికిపోతే మావాడు కాదనేది చంద్రబాబు నైజం. మరి లావు శ్రీ కృష్ణ ఎవరు? వేమిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాగంటి సుబ్బరామిరెడ్డి, సుభాష్‌కోర్, గొలుసు పార్థసారథి, శ్రీనివాసులు ఏ పార్టీ నుంచి వచ్చారు. వీరిలో కొందరికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు కదా. వారంతా కోవర్టులే?

– ఆర్కే రోజా, మాజీ మంత్రి

పల్లెల్లో కల్తీ మద్యం మాఫియా

చంద్రబాబు పాలనలో తెలుగుదేశం నాయకులు కల్తీ మద్యం తయారుచేసి వేల కోట్లు సంపాదిస్తున్నారు. కల్తీ మద్యంతో పేద ప్రజల ప్రాణాలను తీస్తున్నారు. మరో వైపు బెల్టుషాపుల పేరుతో ప్రతి గ్రామంలోనూ మద్యం మాఫియా విచ్చలవిడిగా లూటీ చేస్తోంది. తక్షణ చర్యలు తీసుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం.

– రెడ్డెప్ప, మాజీ ఎంపీ

నకిలీ మద్యం లాభాలు పంచుకున్న కూటమి నేతలు

ములకలచెరువులో తయారుచేసిన నకిలీ మద్యం రాష్ట్రం మొత్తం సరఫరా అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊరూరా బెల్టు దుకాణాలు ఏర్పాటుచేశారు. నకిలీ మద్యంతో వచ్చిన లాభాలు కూటమి పెద్దలు పంచుకున్నారన్నారు.

– ఎంసీ విజయానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త

ఇంకెంత మంది ప్రాణాలు తీస్తారో?

కూటమి నేతలు కల్తీ మద్యం సరఫరా చేసి ఇంకెన్ని ప్రాణాలు తీస్తారో? కూటమి పాలనలో ప్రతి మారుమూల గ్రామంలోనూ బెల్టు షాపులొచ్చాయి. ఇక్కడికి సమీపంలోని ములకలచెరువులో కల్తీ మద్యం స్థావరం ఉన్నట్టే రాష్ట్రంలో మరో 11 చోట్ల ఇలాంటి కేంద్రాలున్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతోంది.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే

ఏడాదిలో కల్తీ మద్యానికి 421 మంది బలి

తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రనాయుడు కల్తీ మద్యం తయారు చేస్తున్నా పట్టించుకోకపోగా అతనిని సౌత్ ఆఫ్రికాలో సొంత వ్యాపారాలను ప్రోత్సహించడం చంద్రబాబుకు సబబు కాదు. ఏడాది కూటమి పాలనలో 421 మంది కల్తీ మద్యం తాగి మృతి చెందారు. నామమాత్రంగా కల్తీ మద్యం తయారీపై కేసులు నమోదు చేయడం పద్ధతి కాదు. అసలైన ముద్దాయిపై నమోదు చెయ్యాలి.

– భరత్, ఎమ్మెల్సీ

నకిలీమద్యంతో పేదల బతుకులు ఛిద్రం

నకిలీ మద్యం పేదలకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊరురా బెల్టుషాపులు పెరిగిపోయాయి. పల్లెల్లో మద్యం ఎరులైపారుతోంది. మద్యం మత్తులో ఏదీ కల్తీయో అమాయక ప్రజలకు తెలియడం లేదు. నకిలీ మద్యం తాగి చాలామంది ప్రాణాలు కోల్పుతున్నారు. ఊరురా మద్యం సరఫరాలో కూటమి నేతల హస్తం ఉంది.

– డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

మత్తులో లైంగికదాడులు చేస్తున్నా పట్టించుకోరా?

పచ్చని పల్లెల్లో పాలకన్నా నకిలీ మద్యమే ఎక్కువగా లభిస్తోంది. మద్యం మత్తులో ఆడ పిల్లలపై లైంగికదాడులకు దిగుతున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోక పోవడం దారుణం. మద్యానికి అలాటు పడినవారు భార్య మెడలో తాళిబొట్టును సైతం తీసుకెళ్లి తాకట్టు పెట్టేందుకు సిద్ధపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ఆడపడుచులకు గౌరవం లేదు.

– కృపాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు సమన్వయకర్త



కుప్పంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ భరత్



కార్వేటినగరంలో నినదిస్తున్న కృపాలక్ష్మి



పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ నిరసన ర్యాలీ



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, అలీమ్‌బాషా, భాస్కర్‌రెడ్డి

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లకు అర్హతే, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రవీంద్రా రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న 5వ విడత అడ్మిషన్ల ప్రక్రియకు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి కాల్ లెటర్స్ పంపరన్నారు. ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 7799679351, 9440738121, 9182590869 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,424 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,872 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారికి క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

17న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 17న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులు మాత్రమే ఈ సెమినార్ పోటీలకు అర్హులని తెలిపారు. క్వాంటం యుగం ప్రారంభం–అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 17న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెమినార్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా స్థాయిలో గెలుపొందే విద్యార్థులు ఈనెల 17న రాత్రి చిత్తూరు నుంచి బయలుదేరి 18వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందని డీఈవో పేర్కొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : అసిస్టెంట్ సర్వేయర్ కోర్సు చేసేందుకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత అసిస్టెంట్ సర్వేయర్ కోర్సు నిర్వహిస్తున్నారని, ఈ కోర్సుకు 5 నుంచి ఏదైన ఉన్నత విద్యవరకు చదివిన వారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 26 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు 9704762155, 9160940479 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 జిల్లా జట్ల ఎంపిక మంగళవారం నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 సెక్రటరీ ఎస్.బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్–19 ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 1–1–2007 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి జిల్లా కేంద్రంలోని శ్రీనివాస స్పోర్ట్స్ మైదానంలో జూడో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. 15వ తేదీన ఉదయం 8.30 గంటలకు అన్నమయ్య జిల్లా, మదనపల్లి జెడ్పీ హైస్కూల్ మైదానంలో బాస్కెట్‌బాల్, హాకీ, నెట్‌బాల్, హ్యాండ్ బాల్ క్రీడా ఎంపికలుంటాయని తెలిపారు. 16వ తేదీన ఉదయం 8.30 గంటలకు చిత్తూరు జిల్లాలోని పలమనేరు జెడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9440758047, 7013554202 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆక్రందన సభకు అనుమతి ఎందుకివ్వరు?

చిత్తూరు కార్పొరేషన్ : బంగారుపాళెంలో ఈనెల 15న నిర్వహించనున్న మామిడి రైతుల సభను అడ్డుకునే ప్రయత్నం మానుకోవాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నాగరాజు, వాడ గంగరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.4 మద్దతు ధరను (ప్రభుత్వం తరపున), రూ.8 పరిశ్రమల నిర్వాహకుల నుంచి మొత్తం రూ.12 ఇప్పించాలన్నారు. ఈ మేరకు ఈ నెల 15న బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించాల్సిన మామిడి రైతుల ఆక్రందన సభకు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఈ విషయంపై స్పందించాలని సూచించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



కొమ్మిరెడ్డిగారిపల్లె వద్ద దెబ్బతిన్న వరిపంట



ఏనుగులు తొక్కేసిన అరటి పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లెలో సోమవారం తెల్లవారు జామున ఏనుగులు పంట పొలాలపై పడి ధ్వంసం చేశాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. మళ్లీ ఏనుగులు ఇదే మండలంలో తిష్ట వేసి పంటలను రోజూ నాశనం చేస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఏడాది కాలంగా ఇక్కడే ఉంటూ రైతులు సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయోనని రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొమ్మిరెడ్డిగారిపల్లెవద్ద సోమ వారం అమరనాథరెడ్డి పొలంలో వరి, అరటి పంటలను తొక్కి నాశనం చేశాయి.

యువత పోటీల్లో రాణించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న పోటీల్లో యువత పాల్గొని రాణించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన సర్వీసులశాఖ నిర్వహిస్తుందన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా యువతకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యే యువత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా చర్యలు చేపడుతారన్నారు. జిల్లా స్థాయిలో ఈనెల 15న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారికి 15 ఏళ్ల నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో కూచిపూడి, జానపదనృత్యం (సోలో), వెస్ట్రన్ డ్యాన్స్ (గ్రూపు) ఉంటాయన్నారు. పోటీలకు సంబంధించిన వాయిద్య పరికరాలు, అలంకరణలు, తదితర వస్తువులు పాల్గొనే యువతే సమకూర్చుకోవాలన్నారు. నవంబర్‌లో రాష్ట్ర స్థాయి, జనవరిలో ఢిల్లీలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 8347711687, 0877–2286921 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 34 ఫిర్యాదులు



చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 34 వినతులు అందాయి. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడీ ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూతగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర రాజు, డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని నేత కార్మికుడి మృతి

పుత్తూరు: పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయం ఎదురుగా రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాద వశాత్తు రైలు ఢీకొని నేత కార్మికుడు దుర్మరణపాలైన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకొంది. రైల్వే పీసీ శివ కథనం మేరకు.. స్థానిక దాసరిగుంట వీధికి చెందిన ఎస్.వి.కిష్టన్(63) పుత్తూరు టౌన్‌లోకి వెళ్లేందుకు ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు రేణిగుంట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు తుపాకీతో సహా వ్యక్తి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రేంజర్ శ్రీరాములు

పుంగనూరు: సోమల మండలం అన్నెమ్మగారి పల్లె అటవీ ప్రాంతంలో బోయకొండప్ప సోమవారం ద్విచక్ర వాహనంలో నాటు తుపాకీ పెట్టుకుని సంచరిస్తుండగా అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. ఫారెస్ట్ రేంజర్ శ్రీరాములు ఆధ్వర్యంలో సిబ్బంది అతని వద్ద నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పింఛన్లు మంజూరు చేయించండయ్యా!

– దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రుల మొర


ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

తవణంపల్లె: 'పిల్లల పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొన్నాం.. కూటమి ప్రభుత్వం మాత్రం కనికరం చూపడం లేదు..' అంటూ దివ్యాంగ పిల్లల తల్లిండ్రులు ప్రాధేయపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పింఛన్లు మంజూరు చేయాలని అర్జీలు ఇస్తూనే ఉన్నాం... కానీ ఇప్పటి వరకు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల పిల్లలతో ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొన్నారు. ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ పిల్లల జీవనాధారం కోసం పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని మొరపెట్టుకొన్నారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ కొత్త పింఛన్లు మంజూరు కోసం ప్రభుత్వం అనుమతిచ్చే వరకు ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. అనంతరం దివ్యాంగులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వరచౌదరి స్థానిక ఎమ్మెల్యే ద్వారా డ్వామా పీడీతో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సహిత విద్యా ఉపాధ్యాయుడు దేవేంద్ర పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ!

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- వివిధ ప్రాంతాల నుంచి క్యూ కట్టిన జనం
- సమస్యలు పరిష్కరించాలంటూ వేడుకోలు
- 364 అర్జీల నమోదు

తమ సమస్యలను పరిష్కరించండి సారూ..! అంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు పీజీఆర్ఎస్‌లో వినతులు అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, డీఆర్వో మోహన్‌కుమార్ ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


కలెక్టర్‌కు సమస్యలు విన్నవించుకుంటున్న అర్జీదారులు

వివిధ సమస్యలపై 364 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వెల్లడించారు.

– చిత్తూరు కలెక్టరేట్

పారదర్శకంగా నిర్వహించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఐక్య కార్యాచరణ సమితి నాయకులు

జిల్లాలో నిర్వహిస్తున్న సదరం క్యాంపులను పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ దివ్యాంగ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘ నాయకులు కలెక్టరేట్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలో కలెక్టర్ ఆదేశాలను అమలు చేయకుండా తూతూమంత్రంగా సదరం క్యాంపులను నిర్వహిస్తున్నారన్నారని ఆరోపించారు. 6,351 మంది దివ్యాంగులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీ అసెస్‌మెంట్ ప్రక్రియపై కలెక్టర్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. అప్పీలు చేసుకున్న దివ్యాంగులకు జిల్లాలోని పుంగనూరు, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ నెల 8 నుంచి రీ అసెస్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తున్నారన్నారు. జేఏసీ నాయకులు ఉమాపతి పిళ్లై, లీలాపతినాయుడు, ఏకాంబరం, చెంచులక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.


భూమిని ఆక్రమించారని చెబుతున్న వడ్డేపల్లె గ్రామస్తులు

భూమిని ఆక్రమించేశారు

తమ భూమిని ఆక్రమించుకున్నారని జీడీ నెల్లూరు మండలం, వడ్డేపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్, ఆ గ్రామస్తులు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ తూగుండ్రం గ్రామ లెక్కదాఖలాలో సర్వే నం.178/2 లో తమ భూమి ఉందన్నారు. తమ భూమికి సంబంధించిన ఒరిజినల్ పట్టాలు తమ వద్దే ఉన్నాయన్నారు. మరొకరు తమ భూమిని ఆక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారని తెలిపారు.

దివ్యాంగ పింఛన్ ఇప్పించండయ్యా

దివ్యాంగ పింఛన్ ఇప్పించండయ్యా అంటూ చిత్తూరు నగరం, సంతపేటకు చెందిన ప్రదీప్ కోరారు. ఆయన మాట్లాడుతూ తనకు మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదం వల్ల నడవలేని స్థితికి చేరానని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితమైనట్లు వాపోయాడు. తన కుటుంబానికి ఎటువంటి జీవనాధారంలేదని, అధికారులు దయ చూపి తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయించాలని వేడుకున్నారు.


దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతున్న ప్రదీప్


దారిని మూసివేశారని చెబుతున్న నరసింహరాజపురం గ్రామస్తులు

దారిని మూసేశారు

తమ గ్రామానికి తరతరాలుగా ఉన్న దారిని మూసివేశారని ఎస్ఆర్‌పురం మండలం, నరసింహరాజపురం గ్రామస్తులు వాపోయారు. ఆ గ్రామానికి చెందిన అంజమ్మ, రవి తదితరులు మాట్లాడుతూ తమ గ్రామానికి సమీపంలో ఎన్‌హెచ్ 716 చిత్తూరు- తచ్చూరు రోడ్డు ఉందన్నారు. జాతీయ రహదారి కారణంగా తమ గ్రామానికి ఉన్న దారిని మూసివేశారన్నారు. తమ గ్రామానికి, పొలాలకు దారి చూపించి న్యాయం చేయాలని కోరారు.

నీతి అయోగ్ డైరెక్టర్‌తో భేటీ


నీతి అయోగ్ డైరెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు విచ్చేసిన నీతి అయోగ్ డైరెక్టర్ జుబైర్ అలీ హష్మీతో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ భేటీ అయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతి పై కాసేపు చర్చించారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇల్లు



బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పంలో పిడుగుపాటుకు ఓ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన రాణెమ్మ ఇంటిపై ఉన్న నీటి ట్యాంకుపై పిడుగు పడింది. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కరెంటు వైర్లు, ఇతర విద్యుత్ సామగ్రి కాలిపోయాయి. రెండు రోజుల క్రితం రాణెమ్మ బెంగళూరులో ఉన్న తన కుమార్తె దగ్గరకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది.

గుప్త నిధుల కేసులో.. ఆ మాజీ పోలీసే కీలకమా?

పలమనేరు: నియోజకవర్గంలో సంచలం సృష్టించిన వీరపల్లి గుప్తనిధుల కేసులో ఓ మాజీ ఏఆర్ కానిస్టేబుల్ పాత్ర కీలకమని తెలుస్తోంది. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం మీడియాతో మాట్లాడిన పలమనేరు సీఐ మురళీమోహన్ సైతం తమశాఖేనని సూచనా ప్రాయంగా తెలిపారు. గతంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసిన చౌడేపల్లికి చెందిన వినోద్‌కుమార్ గత కొన్నాళ్లుగా బంగారు కనిపెట్టే పనుల్లో ఉన్నట్టు తెలుస్తోంది. తన వద్ద బంగారాన్ని గుర్తించే పరికరముందని, దీని ద్వారా భూమిలో ఎక్కడ బంగారు ఉందో కనిపెట్టొచ్చని నమ్మబలికేవాడు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలుచోట్ల రైస్ పుల్లింగ్, పూడుపాములు, అరుదైన నాణాలు, పాత కంచు విగ్రహాల ముఠాలు గత కొన్నేళ్లుగా సంచరిస్తున్నాయి. ఇప్పటికే ఇలాంటి మోసాలు జరిగాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించిన సందర్భాలున్నాయి. ఇలాంటి ముఠాలు సాధారణంగా కలిసే టీ దుకాణాలు, దాబాల ద్వారా భారీ నెట్‌వర్క్ ఉంది. ఇలాంటి వారితో పరిచయం చేసుకొని, వారి ద్వారా బంగారాన్ని కనుక్కుంటామంటూ ఈ మాజీ పోలీస్ ఇప్పటికే కొందరిని ఏమార్చినట్టి తెలిసింది. ఈ నేపథ్యంలో పుంగనూరుకు చెందిన వారి ద్వారా వీరపల్లి సమీపంలోని నిర్మానుష్యమైన గుట్టల వద్ద తాజాగా బంగారు వెలికితీసే పనులు చేస్తుండగా పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

ఇంతకీ స్వామీజీలు ఎలా తప్పించుకున్నారో?

ఇదే కేసులో యువకులు సైతం పోలీసులకు చిక్కినా చిత్తూరుకు చెందిన ఇరువురు స్వామీజీలు మాత్రం ఎలా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో కీలకమని సీఐ చెప్పిన ఏఆర్ కానిస్టేబుల్ సైతం ఘటనా స్థలం నుంచి తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. మాజీ ఏఆర్ కానిస్టేబుల్ గతంలో చిత్తూరులోనే పనిచేసేవాడు. ఈ స్వామీజీలది అదే చిత్తూరు పట్టణం కాబట్టి వీరిమధ్య పరిచయం ఉంటుందనే మాట గట్టిగా వినిపిస్తోంది. మొత్తం మీద ఈ కేసులో పరారీలో ఉన్న మాజీ ఏఆర్ కానిస్టేబుల్ చిక్కితేగానీ గుప్తనిధుల కేసులో చిక్కుముడి వీడేలా లేదు.

ఐక్యంగా ఉద్యమిద్దాం!


జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నేత సుబ్రమణ్యంపిళ్లై

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగారావు పిలుపు
- పుత్తూరులో జిల్లా మహా సభలు ప్రారంభం

పుత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటానికి అన్ని సంఘాల వారు కలసి రావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగారావు పిలుపునిచ్చారు. సోమవారం పుత్తూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో 8వ సీఐటీయూ జిల్లా మహా సభలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ సభలను స్థానిక సీఐటీయూ సీనియర్ నేత సుబ్రమణ్యంపిళ్లై చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ కార్మికుల హక్కులను క్రమేపీ తగ్గిస్తూ, సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొవడానికి అన్ని కార్మిక, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు నాగరాజు, పుల్లయ్య, నాయకులు సుబ్రమణ్యం, జయచంద్ర, ప్రసాద్‌రావు, రమేష్, రామకృష్ణ, శ్రీధర్‌బాబు, జనార్ధన్, వాణిశ్రీ తదితరులు ప్రసంగించారు. తర్వాత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

టీడీపీ నేత బద్రీ ఆగ్రహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులపై టీడీపీ నేత, మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడి తమ్ముడు బద్రీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బలిజ సంఘ నాయకులతో కలిసి ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో సహాయ కమిషనర్ ప్రసాద్‌ను కలిసి, వినతిపత్రం అందచేశారు. బద్రీనారాయణ మాట్లాడుతూ కొంగారెడ్డిపల్లిలో శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను తొలగించే ప్రయత్నాన్ని అడ్డుకుంటామన్నారు. కొంగారెడ్డిపల్లెలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ కడుతున్నారని, దీనికి ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే కౌన్సిల్ అనుమతితో ఏర్పాటుచేసి ప్రజలకు శుద్ధినీటిని అందిస్తున్న వాటర్ ప్లాంట్ కొట్టేస్తామని చెప్పడం మంచిదికాదన్నారు. వాటర్ ప్లాంట్ కొట్టేస్తే ఊరుకునేదిలేదన్నారు. 2014లో నాటి ఎమ్మెల్యే సత్యప్రభ, సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్లాంట్‌ను ప్రారంభించారని గుర్తుచేశారు. అవసరమైతే వాటర్ ప్లాంట్‌ను మరో స్థలంలో ఏర్పాటు చేస్తామని ఏసీపీ నాగేంద్ర చెప్పడంతో.. దీన్ని అంగీకరించబోమని బద్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు.


సహాయ కమిషనర్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న బద్రీ

పత్తికొండలో విషాద ఛాయలు

- ఒంగోలు వద్ద రోడ్డు ప్రమాదంలో పలమనేరు వాసులకు గాయాలు
- విజయవాడలో సమ్మెకెళుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది
- రోడ్డుపై నుంచి నీటిలో పడిన టెంపో ట్రావెలర్



కల్వర్టు పక్కనున్న కాలువలో పడిన వాహనం(ఇన్‌సెట్) మృతుడు చరణ్ ఆస్పత్రికి తరలుతున్న క్షతగాత్రులు

పలమనేరు/గంగవరం: మండలంలోని పత్తికొండలో తీవ్ర విషాదం నెలకొంది. ఒంగోలు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కోకు చెందిన ఓ జేఎల్ఎం మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పలమనేరు ట్రాన్స్‌కో పరిధిలోని సిబ్బంది తమ సమస్యల సాధన కోసం విజయవాడలో సోమవారం జరిగే నిరసన కార్యక్రమానికి ఆదివారం ఇక్కడి నుంచి టెంపో ట్రావెలర్‌లో 19 మంది బయలుదేరారు. వీరి వాహనం ఒంగోలు వద్ద వంతెనపై నుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో గంగవరం మండలం, పత్తికొండకు చెందిన జూనియర్ లైన్‌మన్ చరణ్(30) మృతి చెందాడు. సురేంద్ర, నాయక్, కుపేంద్ర, ప్రసాద్ గాయపడినట్టు తెలిసింది. స్థానిక ట్రాన్స్‌కో ఏడీ జీవన్‌రెడ్డి, అధికారులు సైతం విషయం తెలిసిన వెంటనే అక్కడి ఆస్పత్రివద్దకు వెళ్లారు.

గుజ్జు ఫ్యాక్టరీలకు కూటమి సహకారమా?

యాదమరి: గుజ్జు ఫ్యాక్టరీలకు కూటమి ప్రభుత్వ పెద్దల నుంచి పరోక్ష సహకారం ఉండడంతోనే మామిడికి రూ.8 చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్ధన్, మునీశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 15న బంగారుపాళ్యంలో నిర్వహించనున్న ఆక్రందన సభ విజయవంతం కోసం వారు సోమవారం పూతలపట్టు, పి.కొత్తకోట, కొటాలం గ్రామల్లోని రైతులను కలసి కరపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ మామిడి బిల్లుల ఆలస్యానికి గల కారణం కర్మాగారాల యాజమాన్యంతో పాటు కూటమి ప్రభుత్వ పెద్దలేనన్నారు. గుజ్జు కర్మాగారాలకు లబ్ధి చేకూర్చడానికి 40 వేల మంది రైతుల ప్రయోజనాలను తాకట్టుపెట్టారని ధ్వజమెత్తారు. బుధవారం జరిగే ఆక్రందన సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మామిడి రైతులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి సంజీవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాజారత్నం రెడ్డి, రైతు నాయకులు చెంగల్రెడ్డి, నరసింహులు నాయుడు, జ్ఞానశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ఉప్పొంగినది!

– చిత్తూరులో నీవానది బీభత్సం

చిత్తూరు నగరంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నీవాది ఉప్పొంగింది. తమిళనాడులోని పరదరామి, గుడియాత్తం మీదుగా వర్షపు నీళ్ల యాదమరి నుంచి చిత్తూరు నగరంలోని నీవానదిలోకి భారీగా వచ్చి చేరింది. సోమవారం ఉదయం 4 గంటల నుంచే నీవానది పరివాహక ప్రాంతమైన తేనబండ, గంగాకాలనీ, వీరభద్రకాలనీ, రాజుగుడి వీధి, లిల్లీబ్రిడ్జి, కైలాశపురం, తోటపాళ్యంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయ్యాయి. ఇళ్లలోకి వర్షపునీళ్లు రావడంతో నిత్యావసర వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వేలాది కుటుంబాలున్న నీవానది పరివాహక ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

– చిత్తూరు అర్బన్


వరద నీటిలో పిల్లాడిని భుజంపై ఎక్కించుకుని వెళ్తున్న తల్లి


నీవానది వరదనీటిలో అల్పాహారం తీసుకెళ్తున్న పిల్లలు


ఇళ్లలోకి వచ్చిన నీటిని తోడుతున్న స్థానికులు


చిత్తూరు తేనబండ వద్ద ఇళ్ల నుంచి బయటకు రాలేక అవస్థలు పడుతున్న జనం